# శ్రీవారి ముచ్చట్లు


ఉషాసుందరి

*గంట ఏడున్నర కొట్టారు. ఎండెక్కుతున్నా, చల్లటి గాలి వేస్తోంది. పచ్చటి ఆకుల్లోకి దూరి సూర్యకిరణాలు చక్కిలిగింతలు పెడ్తున్నట్లున్నాయి.*

వాతావరణం ఆహ్లాదంగా వుందని కాబోలు, పక్షులు కూడా సావకాశంగా చెట్ల కొమ్మలపై ఉయ్యాలలూగుతూ కబుర్లాడుకుంటూ, మధ్య మధ్య కిలకిలమని నవ్వుకుంటున్నాయి. వంట కోసం కూరలు తరిగి పెట్టుకుంటూ, నూరాల్సిన మసాలాలు సిద్ధం చేసుకుంటూ హడావుడి పడిపోతున్న నాకు ఆకుల గలగలలూ, పక్షుల కిలకిలలూ, సూర్యకిరణాల తళతళలూ అద్భుతంగా తోచాయ్. ఏమిటివాళ? ప్రకృతంతా ఇంత సందడి చేసుకుంటూంది? ఏదన్నా విశేషమా ప్రభాత సుందరి, ప్రభాకరుడూ తీరికగా కూర్చుని ముచ్చట్లు చెప్పుకుంటున్నారల్లే వుంది. అందుకే కాబోలు పక్షి జంటలూ, పూలబాలలూ మహానందంతో కేరింతలు కొడ్తున్నాయి. మహా సంరంభంగా వున్న ప్రకృతిని చూస్తుంటే మనోహరమైన భావనలతో మనసు నిండి, నా గొంతులోంచి రాగాలు పుట్టుకొచ్చాయి. "ఊయలలూగే, నా హృదయం, తీయని పాటా పాడేలే" పాటతోపాటు శ్రీవారు కూడా పక్కనుంటే ఇంత అందమైన ఉదయం ఇంకా అందంగా, ఆహ్లాదంగా వుంటుంది కదా అన్పించింది. ఏం మనిషి, ఇంకా లేవరు. ఎనిమిదవుతోంది. పొద్దెక్కినా మొద్దునిద్దరే ఈయనకి. లేపకపోతే, ఇహ తెల్లారదు కాబోలు. అయినా అంత నిద్ర ఎలా వస్తుందో! పెళ్ళి ముందూ, పెళ్ళయిన కొత్తల్లో ఎన్ని కబుర్లు చెప్పారనీ! "భార్యా భర్తలిద్దరూ కలిసి పని చేసుకుంటే ఎంత ఆనందంగా వుంటుందోయ్. రోజూ నేన్నీకు కూరలు తరిగిచ్చి, వంటెంట్లో నీతోపాటే వుంటే నీకు హుషారుగా వుండదూ" అంటూ. నిజమే. భర్త తన కొంగుపట్టుకుని కూడా కూడా తిరుగుతుంటే ఏ ఆడదానికి గర్వంతో మనసు పొంగదు? అవన్నీ ఇప్పుడేమయ్యాయో? ఏ తొమ్మిదికో లేచి, టీ తాగేసి, బుద్ధిగా పేపర్ చదివి, పదింటికల్లా అన్నం తినేసి బుద్ధావతారంలాగా ఆఫీస్‌కి పోయి రావటం, సాయంత్రం టి.వి.లు, సెలవురోజున వీడియోలు వుండనే వున్నాయి. అయ్యో! కాస్త తొందరగా లేచో, సాయంత్రాలు త్వరగా వచ్చో ఇంటి దానితో ఓ అచ్చటా, ముచ్చటా చెప్పుకుందా మన్పించదే ఈ మగమహారాజుకి! కబుర్లాడటానికి పెళ్లాం పనికి రాదు కాబోలు. కొలీగ్స్ కానీ, మగఫ్రెండ్సో, లేక పై ఆడవారో కావాలేమో! ఎంత మనోహరంగా వుంది సమయం. ఇలాంటి వేళలో పక్క పక్కనే ఒకరినొకరు చూసుకుంటూ, కళ్లతో కళ్లు మేళవించి కూర్చున్నా ప్రణయ సంగమమే కాదా! ఇంతకంటే, తృప్తీ, ఆనందం, రతి కేళిలోనయినా వుందా అసలు? అయినా ఇంటెద-ఇంటి పనులకీ, పిల్లా పాపలను



కని పెంచడానికే తప్ప కులాసా కబుర్లకే మాత్రం పనికి రాదేమో! అందుకే గ్రీకు మహాశయులు ప్రేమ కలాపాలకీ, ప్రణయ సల్లాపాలకీ, తర్కవితర్కాలకీ, వేదాంత విచారాలకీ కోర్టిజాన్స్ అని వేశ్యాజాతి ఆడవారిని ఎన్నుకున్నారు. పెళ్లాం ఇంటి పన్లు, వంశోద్ధారణకి తప్ప మరెందుకూ రుచించలేదు వాళ్లకి. అందమైన కోర్టిజాన్స్‌తో సాయంత్రాలు హాయిగా, కబుర్లు చెప్పుకుంటూనో, శాస్త్రవితర్కం చేస్తూనో, కవితా పఠనం కావిస్తూనో ఉల్లాసంగా గడిపేవారు. ఫ్రెంచివారూ అంతే! సాలన్స్‌లో పై ఇంటి స్త్రీలూ, ఫ్యాషనబుల్ స్త్రీలతో చర్చలూ, సాహిత్య పఠనం చేయటమే తప్ప భార్యల దగ్గర బిగిసి పోవటమే! మరో మగాడు తన భార్యలో గుణాలూ, టాలెంట్స్ గుర్తించి పొగిడితే అదో ఆశ్చర్యం, ఆపై అసూయా, క్రోధమూ, యుద్ధమూనూ! అంతే తప్ప ఈ భార్య అనేది ఓ మనిషే. దానికీ మనసు, కోరికలూ, ముచ్చట్లూ, వుంటాయనీ, అదీ తనతో ఏ సబ్జక్టు మీదయినా చర్చించగలదనీ, మీమాంస చేయగలదనీ ఎందుకనుకోరో?-సాహిత్య సంగీత శ్రవణాలకి ఉమ్రావ్ జాన్‌లే కాని సతీమణులకి అర్హత లేదు కాబోలు! ఆలోచిస్తుంటే భార్యలనే జీవులనీ భర్తలు ఎంత కించగా చూస్తున్నారూ అనిపించి ఎక్కడలేని ఆవేశం పుట్టుకొచ్చింది. అందుకే కాబోలు, ఆడదై పుట్టటం కన్నా అడవిలో మానై పుట్టడం మేలన్నారు మన వాళ్లు. అడవిలో మానుకైనా ఓ విలువా, మూల్యమూ వున్నాయి. ఈ ఆడదానికదీ లేదు. తర తరాలుగా, అన్ని దేశాలూ, అన్ని సమాజాలూ స్త్రీనింత చవకగా చూస్తూండటం-ఛ! ఏం బతుకులు- రోటీన్ బతుకులు. పాతకాలం వాళ్లకంటే చదువులూ, చట్టుబండలూ లేక





గాను గెద్దు బతుకే ఆడదానికొక భాగ్యం అనుకుని అందులో పడి కొట్టుకున్నారు. చదువుకుని, సంసారాలు దిద్దుకునే తెలివి తేటలు వుండి కూడా ఆడది తన సంసారాన్ని, బతుకునీ తనక్కావాల్సినట్టు మలచుకోలేక పోతోందంటే -దీనికీ నిర్లక్ష్యపు ధరలే కదూ కారణం?!-నా ఆలోచనలకి బ్రేకు వేస్తూ-పక్షుల కిలకిలలు వినబడ్డాయి. చేస్తున్న పని ఆపి తలెత్తి చూశాను. రెండు తెల్లటి పావురాలు, ఎదురుగా జామచెట్టు మీద కూర్చుని, నల్లపూసల్లాంటి కళ్లు గుండ్రంగా తిప్పుతూ, కువకువలాడుతూ కవ్వించాయి. ఆ పక్కనే మరో కొమ్మ మీద రెండు మైనగోర్లు కబుర్లాడుకుంటున్నాయి. కొబ్బరి చెట్టు మీద చిలుకాగోరింకలు ముక్కులతో పొడుచుకుంటూ ముచ్చట్లు చెప్పుకుంటున్నాయి. అన్ని జంటలను చూస్తుంటే, చెప్పొద్దూ నాక్కూడా నా జతగాడి మీద బలే మనసయింది. చేతిలో పని వదిలేసి, ఉన్నపళంగా లేచి, పడకగదికేసి గబగబా నడిచాను. గదికంత దూరం నించే వినబడ్తోంది శ్రీవారి గుఱ్ఱు. నేనింత మాంఛి రసవంతమైన మూడ్‌లో వుంటే, ఈ మనిషి ఏమీ పట్టనట్టు గుఱ్ఱుకొడ్తూ నిద్రపోవట మేమన్నా బాగుందా? చిత్రెత్తు కొచ్చింది నాకు. అధాటున లేవదీసి కూర్చోబెట్టి ఎడాపెడా దులిపేస్తానివాళ. అసలు రోజూ నాతో పాటు లేచి నాకు కంపెనీ యిస్తే తప్ప నేను వంటే చేయనింక, ఏం చేస్తారో చేసుకోమను. కోపంగా తలుపులు తెరిచి దూకుడుగా లోపల కదుగుబెట్టాను. ఓ పక్కకి తిరిగి ఓ చేయి చాచి తలగడ కింద పెట్టుకుని, మరో చెయ్యి వీపుమీంచి వెనక్కి అడ్డంగా పడేసుకుని, పసిపిల్లల్లాగా పడుకుని గాఢంగా నిద్రపోతున్నారు అయ్యగారు. తలుపు ధడేలుమన్న శబ్దం కూడా ఆయన్నేమీ కదల్చలేదు. ఆ పడుకున్న తీరు, భంగిమ చూస్తే కోపమంతా కరిగి

పోయి ముద్దొచ్చిందమాంతం. ఈ మనిషి మీద నేనసలు కోపగించుకోగలనా?-కాస్సేపలాగే చూస్తూ నిలబడ్డాను. రాత్రి ఉక్కకి లాల్చీ విప్పి పక్కన పడేశారు. విశాలమైన వక్షం మీద, భుజాల మీద, చేతుల మీద నల్లటి వెంట్రుకలు గాలికి అలవోకగా కదుల్తున్నాయి. భల్లూకం! ఒంటినిండా రోమాలే. నవ్వొచ్చిందొక్కసారి. "ఏమిటండీ ఈ రోమాలు, ఎలుగు బంటిలాగా. ముద్దెట్టుకుందామన్నా దగ్గరగా కూర్చుందామన్నా, గుచ్చుకుంటాయేమో భయం" అన్నానో సారని ఎంత హడావుడి చేశారని. అదే మగటిమికి చిహ్నమన్నారు. పేడి వాళ్లకీ, ఆడవాళ్లకీ తప్ప మరెవరికీ ఒంటి మీద జుట్టు లేకుండా వుండదన్నారు. నేనేం బృహన్నల ననుకున్నావా అని మండిపడ్డారు. పురుషుని సౌందర్యానికీ, ఐశ్వర్యానికీ అతడి ఛాతీ మీద, భుజాల మీద, చేతుల మీద ఉండే చిక్కటి జుట్టే కారణమని జ్ఞానబోధ చేశారు. నీకు తెలీకపోతే, వెళ్లి మీ ఇంట్లో పెద్ద వాళ్లనెవరినైనా అడిగి తెలుసుకోమని సవాల్ చేశారు. ఆయన వీరావేశం చూసి హడలిపోయా నారోజు. అనర్గళంగా సాగిపోతున్న ఆయన లెక్చర్నిలా ఆపాలో తెలీక, మురిపెంగా దగ్గరకు చేరి, ఆయన చుబుకాన్ని పట్టుకుని కళ్లల్లోకి చూస్తూ మెత్తగా అడిగాను. "అయితే మీలాంటి భల్లూ దొరకటం నాదే పరమభాగ్యమా?" "మరేమిటనుకున్నావ్" అంటూ నా గుండెల్లోకి పసిపాపలాగా ముఖం దూర్చుకుంటూ, "ఆ పేరే ముద్దుగా వుంది. అలాగే పిలు నన్ను" అని అనుగ్రహించారు. "ఏదీ?

## శ్రీవారి ముచ్చట్లు

భల్లూనా?" "ఊ", హమ్మయ్య! కోపం తగ్గటమే కాదు, మహాప్రసన్నమయారే అని సంతోషపడ్డాను. స్వామి వారు సెలవిచ్చాక, ఇహ మనకేం బాధని ఆ పేరే స్థిరపరిచేశానప్పట్నుంచీ. ఫరవాలే, సరస హృదయుడే నా మొగుడు. హత్తెరీ నన్ను ఎలుగుబంటి అంటావా అని అంతెత్తు నెగిరి, ఎంత పొగరే నీకని వీరాంగం వేయ లేదు, నయమే!-వాచీ ఎనిమిది కొట్టింది. ఉలికిపడి, ఆలోచనల్లోంచి తేరుకుని మంచం వేపు నడిచాను. మెల్లగా పక్కలో కూర్చున్నాను. మనిషెక్కడా కదల్లేదు. కాస్సేపలాగే కూర్చుని ఒంగి మొహం మీద మొహం పెట్టి చూశాను. ఆయన బ్రహ్మాండమైన గుఱక నా ఉచ్ఛ్వాస నిశ్వాసాలని ఆయనకి తగలకుండా బ్రహ్మాస్త్రంలా అడ్డుకుంటూంది. ఇహ లాభం లేదు. "సార్!"-చలనం లేదు. "మాస్టర్‌జీ!" వినయంగా పిలిచాను. ఊహూ! ఎంగి చెవి దగ్గరగా నోరుపెట్టి "స్వామీ!" అని భక్తిగా పిలిచాను. అదీ పనైయ్యేలా. "అయ్యా!" అన్నాను. గట్టిగా వ్యాపార ధోరణిలో కొద్దిగా కదిలి, మళ్ళీ గుఱ్ఱు మొదలెట్టారు. ఏం చేయటం? "ఏమండీ!" గోముగా అన్నాను. అబ్బే! "ప్రభూ!" నిస్సహాయత గొంతులో. పక్కకి తిరిగి, వెల్లకిలా పడుకుని నా చేతిని గుండెల మీదకి లాక్కుని గుఱ్ఱుకొట్టసాగారు. ఏం మనిషి! పొద్దున్నే ఏ భార్య వచ్చి ఇలా రకరకాలుగా పిలిచి ముద్దులొలక బోస్తుందిట! నేను కదాని వచ్చి ఇంత సరసంగా పిలుస్తుంటే వినేపించుకోరు! ఇలాంటి మనిషి భల్లూకం కాకపోతే మరేమిటి? పెట్టి పెట్టి మంచి పేరే పెట్టాలే-అరె-మెరుపులా వచ్చింది అయిడియా. ఎంత ఫూల్‌ని నేను అనుకుంటూ, చెంపకి చెంప చేరుస్తూ పిలిచాను-'భల్లూ!' ప్రేమ, అసహాయత, చిలిపితనం అన్నీరంగరించి, "ఊ" వెంటనే వచ్చేసింది జవాబు. జవాబుతోపాటు ఆయన చేతులు కూడా పైకి లేచి నన్ను చుట్టేసుకున్నాయి. గుండె ఝల్లుమని, ఒళ్లంతా పరవశించిపోయింది. ఆ బాహు బంధంలోంచి అనురాగధార నాలోకి ప్రవహిస్తున్నదా? ఏదో వివశత. ఆయన ఛాతీ మీద తల వాల్చేసి మౌనంగా వుండిపోయాను. ఇదే అదనని స్వామివారు మళ్ళీ గుఱ్ఱు మొదలెట్టేశారు. మొదటి కంతా మోసం వచ్చింది. ఇప్పుడేం చేయడం?-మళ్లీ మేలుకొలుపులు పాడాలంటే నీరసం వచ్చింది. నిశ్శబ్దంగా కూర్చున్నాను. కాస్సేపాగి మొదలెట్టాను. "భల్లూ! మీరిక్కడిలాగ ఒళ్లు తెలికుండా నిద్రపోతున్నారు కానీ, బయట ఎంత సందడిగా వుందో తెల్సా?" "ఏం సందడీ?" తెఱవు మఱవుగా అడిగారు. హమ్మయ్య! వింటున్నారు కదా! ఇహ నేను ఏకధారగా మొదలెట్టాను- "ఎంత మంది మీ కోసం వచ్చి కూచున్నారో తెల్సా" ఆయనేం కదలలేదు. "ఎవరూ?" యధాలాపంగా అడిగారు. అంతలో మళ్లీ గుఱ్ఱు. ఆయన మీదకి వాలి జుట్టులోకి వేళ్లు పోనిచ్చి నిమురుతూ చెప్ప సాగాను. "పక్షులొచ్చాయ్. పువ్వులొచ్చాయ్. పిల్లగాలులొచ్చాయ్. తెల్లమబ్బులొచ్చాయ్. పూల సౌరభాలొచ్చాయ్-" "ఊహూ! ఏమేం పక్షులొచ్చాయ్?" "ఏమేమిటొచ్చాయని తాపీగా అడుగుతున్నారా? మైనగోర్లొచ్చాయి. చిలకా గోరింకలొచ్చాయి. ఇంకా గువ్వపిట్టలొచ్చాయి. కోయిలలొచ్చాయి. నీలాపు పాలపిట్టలొచ్చాయి. అన్నీ జంటలు జంటలుగా కొమ్మల మీద కూర్చుని, మిమ్మల్ని పిలుస్తున్నాయి. ఇంకా లేవలేదాని అడగుతున్నాయ్. ఎప్పుడు లేస్తారోనని తొంగి చూస్తున్నాయ్. లేవండీ!"

శ్రీవారి ఆసక్తి పుంజుకున్నట్టుంది



నన్ను మరింత దగ్గరగా లాక్కుని, నా మెడ వంపులో ముఖాన్ని ఆన్చి "ఇంకా ఎవరెవరొచ్చారయా?" అడిగారు. ఆ స్వరంలో ధ్వనిస్తున్న కుతూహలాన్ని గమనించి, మంత్రం ఫలించిందనుకున్నాను.

"ఎఱ్ఱ గులాబీలొచ్చాయండి. తెల్లగులాబీలు విరగబడ్తున్నాయి. మల్లెలు గుమ్మెత్తిపోతున్నాయి. నిన్న సాయంత్రమనగా పూచిన జాజులు కూడా మీ కోసం కాచుక్కూచున్నాయి, రాలిపోకుండా. పారిజాతాలు, నందివర్ధనాలు, మందారాలు- ఓహో ఎన్నెన్నో! ఊగీ, వూగి, తలలెత్తి మెడలు నిగిడ్చి చూస్తున్నాయి, మీ కోసం. గదిలోంచి లేచి పెరట్లోకొస్తున్నాయి

కోసం. గదిలోంచి లేచి పెరట్లో కొస్తున్నారేమోనని ఎఱ్ఱగులాబీలయితే మరీను. వొంగీ, తొంగీ చూస్తున్నాయి మీకోసం"

'ఇంకా?' ఆయన గొంతులో ఆవేగం.

"పిల్లగాలులు రివ్వుమంటూ లోపలికి దూసుకొస్తున్నాయి. మీరెక్కడున్నారోనని గదులన్నీ గింగిరాలు తిరుగుతున్నాయి."

"మరిక్కడికి రాలేదేం? ఈ ఫ్యాన్ గాలి తగలనిచోటల్లా నాకు ఉక్కపోసి చెమటల్లు వద్తుంటే?" కినుకగా అడిగారు.

మరి మీరు గది తలుపులు బిడాయించేసుకుని పడుకుంటే ఎలా వస్తాయి, పాపం సముదాయింపుగా అన్నాను. "చూడండి. ఇప్పుడు నేను తలుపు తీశాగా. లోపలకొచ్చి గదంతా చల్లగా, ఎయిర్ కండిషండ్ లాగా చేసేశాయి."

"ఊ!" అంటూ గునిశారు శ్రీవారు. "సూర్యుడయితే ఎప్పుడనగా వచ్చేశాడండీ, పాపం. ఎండెక్కకుండా మీతో వూసులాడదామని మహా ఉబలాట పడిపోతున్నారు లేవండి మరి. ఒక్కసారి పైకొచ్చి చూడండి. అందరూ మీ కోసం ఎలా కాచుక్కూచున్నారో. వాళ్ళందరికీ మీరంటే ఎంత ప్రేమో చూశారా మరి. అందరూ మీరే కావాలని అడుగుతున్నారు. లేవండి సార్. రా రమ్మని పిలుస్తున్నారు. పదండి. సూర్యుడు తన లేత కిరణాలను లోపలకి పంపిస్తున్నాడదిగో, మిమ్మల్ని తీసుకు రమ్మని, ఇంకా పడుకుంటానంటారేమిటి?" అంటూ నేను హడావుడిగా లేచి కూర్చుని, ఆయన్ను కూడా లేవదీసి కూర్చోబెట్టేశాను.

"ఓహ్! వీళ్లే కదా వచ్చింది. ఇంకెవరూ లేరా?" అంటూ నిరుత్సాహంగా



## కిమీ సమస్యలు

**కిమీ కాట్కర్ తన భర్త మూలంగా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. ఇన్నాళ్ళు తను గడించిన పేరును భర్త కాల రాస్తున్నాడని బెంగపడుతోందట. సినిమాలకు బుక్ అయ్యే సందర్భంగా తన భర్త అంతులేని డిమాండ్ల మూలంగా నిర్మాతలు వెనక్కు పోతున్నారని, భర్త మూలంగా యిన్నాళ్ళు మిత్రులుగా వున్నవాళ్ళు శత్రువు లవుతున్నారని కిమీ వాపోతోంది. భర్త మాట వినకపోతే ఎలా అని అనుకుని సర్దుకుపోదామంటే వచ్చిన అవకాశాలు చేజారిపోతున్నాయట. మరి ఈ సమస్యల్ని ఎలా ఎదుర్కొంటుందో!**

నా భుజం మీద తలవాల్చుకున్నారు మళ్లీ.

"ఉన్నారండి. లేకేం? మీ ఫేవరిట్ వున్నారు."

"ఎవరూ?" అన్నారు తలెత్తి చురుగ్గా చూస్తూ.

లేచి ఆయన ఎదురుగా నిలబడ్డాను. రెండు చేతులూ ఆయన భుజాల మీద వేసి, కళ్లల్లోకి కొంటెగా చూశాను. "ఉషబాల".

"వారె! మరి చెప్పవేం? ఎప్పుడొచ్చింది?" నా రెండు చేతులూ పట్టుకుని ఖుషీగా ముద్దెట్టుకున్నారు.

"ఎప్పుడేమిటీ? మీరంటే ఇంత పొద్దెక్కిందాకా మొద్దు నిద్దర పోతున్నారు. కానీ, ఆవిడ పొద్దు పొడుస్తూనే మొదటి జామునే వచ్చేసింది, మీ కోసం. మీరు లేచి వస్తారని ఇంతమందిని పిలుచుకొచ్చింది మహా సంరంభంగా. మీరు రాలేదని కోపగించుకుని సూర్యుడు వేడెక్కిపోకుండా వుండాలని, మబ్బుల్ని రమ్మంది. పిల్లతెమ్మెరలని రమ్మంది. కోయిలలని పాడమంది. పువ్వుల్ని ఆడమంది. పిట్టల్ని గంతులేయమంది. త్వరగా రండి మాస్టర్ జీ. ఇంకా ఆలస్యం చేస్తే ఎవరి వన్ల మీద వాళ్లెల్లి పోవద్దు మరీ. పాపం వాళ్ల కాలస్యమైపోతూంది. లేవండింక" చేయి పట్టుకుని లాగారు.

"పదయితే. ముందే ఉషబాల వచ్చేసిందని చెప్పంటే ఈ పాటికి లేచే వుందునుగా" అన్నారు హుషారుగా. "ఆడబుద్ధి పోనిచ్చుకున్నావు కాదు! ఆఖరిదాకా నాకెంతో ప్రియమైన వ్యక్తి పేరు చెప్పకుండా దాచేశావు."

"అవున్లెండి. పక్కనెంత అందమైన పెళ్లాం వున్నా, మరో ఆడదంటేనే మక్కువ మీకు. మీ మగబుద్ధి బాగుందటనా?" అలిగాను.

"ఊహూ. నా ఉషబాలని నా పక్కనే వుంచుకుని, నా చేతుల్లో బంధించి, ఆమె ప్రతిరూపం విశ్వమంతా పరచుకుంటుంటే చూడాలని" అనురాగంగా నన్ను దగ్గరకి తీసుకుంటూ అన్నారు. నా పేరుతో శ్లేష వాడుతున్నారని అర్థమవుతున్నా, వెంటనే కరిగిపోతే లోకువైపోతానని, "చాల్లెండి.

గడుసుతనం. మాటల గారడీ చేయటానికి మీ తర్వాతే ఎవరైనా" టవల్ తీసుకుని శ్రీవారిని ముందుకు తోశాను. బ్రష్షూ, పేస్ట్ తీసుకుని వెళ్లేసరికి అయ్యగారు అచ్చం కవిసార్వభౌముల్లాగా నిలబడి, ప్రకృతంతా నిండిన సందడిని తిలకిస్తున్నారు. అలికిడి విని, పక్కకు తిరిగి నావేపు భావగర్భితంగా చూశారు. అందాలు సంతరించుకుని నవనవోన్మేషంగా కాంతులీనుతున్న ఆ ఉదయాన్ని చూస్తుంటే అయనకీ హృదయం స్పందించిందల్లే వుంది. కళ్లల్లో అవ్యక్తమైన మెత్తదనం మెరిసింది.

కాలకృత్యాలు తీర్చుకుని లోపలకొచ్చారు. టీ కప్పు చేతికిచ్చి, నేనూ ఓ కప్పు తీసుకుని, అయన పక్కనే చేరాను. చేయి చాపి, నా ఒళ్లో వేశారు. "చాల ప్లెజంట్‌గా వుందివాళ" అన్నారు మెల్లగా. గట్టిగా మాటాడితే ఆ అనుభూతి కరిగిపోతుందేమోనన్నట్టుగా. అవునన్నట్టుగా తలూపి, అయన్ను అనుకుని కూర్చున్నా. మాటల అవసరం కనిపించలేదిద్దరికీ. ప్రకృతిలో చిందులేస్తున్న సౌందర్యమూ, ఆనందమూ, మాలో అణువణువులోకీ ప్రవహిస్తూ ఇద్దర్నీ దగ్గరగా; మరింత దగ్గరగా, ఒక్కటిగా బంధిస్తున్న భావన. అయనకీ అలాగే వుందేమో, నా వేళ్ళని తన బలమైన వేళ్ళతో సున్నితంగా బంధిస్తూ, నా కళ్ళల్లోకి చూశారు. ఇద్దరిలోనూ ఒకే భావన; ఒకే రాగం; ఒకే స్పందన; ఒకే వివశత తెలుసుకున్న కళ్లు మనోహరమైన కాంతితో వెలిగాయి. అంతరాంతరాలలోంచి ప్రణయభావన ధారలై మా ఇద్దర్నీ తడిపేసింది.

ఎండ చురుకుమంటూ పలకరించటంతో పారవశ్యంనించి తేరుకున్నాము. వదిలేసిన వంటపని పూర్తి చేయటానికి లేచాను. మనసంతా తేలికగా, హాయిగా వుంది. "మరో కప్పు టీ ఇయ్యవోయ్" అన్నారు. పొయ్యి మీద గిన్నె లెక్కించి, టీ తీసికెళ్లాను. "అద్భుతంగా వుందివాళ టీ. రోజూ ఇలా చేయకూడదూ?" చిలిపిగా అడిగాను.

"ఎందుకు చెయ్యను? ఇవాళా నేను చేశాను. రోజూ నేనే చేస్తున్నాను. ఆ మనిషినేగా! మరి రోజూ మీరిలాగా పొద్దున్న పొద్దున్నే లేచి నాతో పాటు కాస్సేపు కూర్చోండి. అన్నీ ఫస్టుగా వుంటాయి. పెళ్లయిన మొదటి నెలల్లోనే ఆ మురిపాలన్నీ. పాతబడే కొద్దీ, భోజనాల వేళకే పెళ్లాం ముఖం చూడటం.

## అక్షరావళి

**అజ్ఞాన అంధకారాన్ని**
**బొగ్గులా చుట్టుకున్న**
**బ్రతుకుల్లో -విజ్ఞానం**
**ఎర్రగా ప్రజ్వరిల్లేందుకు**
**అక్షరం... అగ్నికణమైతే**
**అది అక్షర దీపావళి!**
**నిజాయితీ దోపిడీకి గురవుతూ**
**నిరక్షరాస్యత నీడలు నిలువెత్తుగా**
**నిర్భాగ్యుడిని నిరాశా చీకటిలో**
**నిస్సారంగా నిలబెడితే,**
**అక్షరం... ఆరోప్రాణమై**
**అక్షరం కాంతి కిరణమై**
**అతని చేతిలో ఆయుధమైతే**
**అది అక్షరాలా దీపావళి!**

-శిరీష

అదీ అవసరం కదాని. ఇంతకీ నాకు తెలీకడుగుతాను కానీ, అవసరాలు తీర్చటానికేనా ఏం భార్య?"-ఆవేశం ఉప్పొంగింది నాలో.

అయనేం మాట్లాడకుండా నా వేపే చూస్తూ కూచున్నారు. ఇదినా భార్యేనా అన్నట్టు. దొరికినఅవకాశాన్ని వదుల్చుకోదల్చుకోలేదు నేను.

"ఏం ప్రొఫెసర్ సాబ్, మాట్లాడరే. ఇదిన్ని మాటలెలా నేర్చుకుందనా? అవసరం, సార్, అవసరం. మన పెళ్లయిన కొత్తలో ఎలా వుండేవాళ్లం? ఒక్కసారి గుర్తు తెచ్చుకోండీ." పాత జ్ఞాపకాలు వెల్లువలై పొంగే సరికి మనసు నిండుకొచ్చి కొన్ని నిముషాలు మాట్లాడ లేకపోయాను. చేతిలో పని పక్కన పడేసి, లేచి వెళ్లి అయన ఒళ్లో తలదాచుకున్నాను. నా భావావేశాన్ని గమనించి అర్థం చేసుకున్నట్టుగా నా తల మీద చేయి వేశారు. "చూడండి. ఇవాళలాగా రోజూ కాస్సేపు ఒకళ్ల కొకళ్లకి చేరువగా కూర్చుని నిశ్శబ్దంగా కబుర్లు చెప్పుకుని ఎన్నాళ్లయిందండీ. పెళ్లయిన తర్వాత మనమేం ప్రమాణం చేసుకున్నాం? అందరిలాగా మనం కూడా మన బంధాన్ని సడలనివ్వకుండా, మన మధ్యదూరం పెరగకుండా దాంపత్య శోభను నిత్యనూతనంగా ఉంచుకోవాలనుకోలేదూ? ఇప్పుడో? మనమూ అందరిలాగే రొటీన్ చేసేసుకుంటున్నాము బతుకులు. అసలింతకీ సెక్స్ ఒక్కటే భార్యభర్తల మధ్య ఆకర్షణా ఏమిటి? ఇప్పుడు కొన్ని నిముషాల క్రితం మనిద్దరం కలిసి అనుభవించిన కలయిక, అనుభూతి ఏ సెక్స్‌కి సాటి వస్తుందో చెప్పండి. మనిద్దరిలోనూ ప్రవహించిన అనురాగ స్రవంతి మన అంతరాంతరాల్లోనూ నిండిపోయి ఆత్మలుసంగమించలేదూ? ఆ ఆనందంతో ఒంట్లో కొత్త శక్తి పుట్టుకు రాలేదూ? ఆ శక్తేనండి, భర్త భార్యకిచ్చేది, నగలూ, చీరలూ కాదు. అంతే కాదు. ఆ శక్తి నుండే భార్యనించి అంతులేని ప్రేమా, భక్తీ పొందేది. ఇది పరస్పరమూ ఇచ్చిపుచ్చుకునే శక్తి." హఠాత్తుగా నా గొంతు జీరబోయింది.

నా తల నిమురుతున్న శ్రీవారు నన్ను లేపి, రెండు చేతుల్లో నా ముఖాన్ని సుతారంగా పట్టుకున్నారు. అయన కళ్లల్లోనూ, పెదవులపైనా చిలిపి నవ్వొకటి మెరిసింది. "అమ్మాయీ! ఓర్పుగా నీ లెక్చర్ విన్నందుకు ఫీజు తర్వాత వసూలు చేసుకుంటా గానీ, ముందిది చెప్పు. మన మధ్యదూరం పెరిగి, రొటీన్ బతుకు అయిపోతున్నాదన్నావ్. అది నా ఒక్కడిదేనా తప్పు?- నీదేం లేదా? నువ్వు నన్ను లేపి ఎన్నాళ్లయ్యింది? పెళ్లయ్యాక రోజూ ఎలా లేపేదానివో జ్ఞాపకం తెచ్చుకో. నువ్వొచ్చి లేపిందాకా అలాగే పడుకుని వెయిట్ చేసేవాడినో లేదో గుర్తు చేసుకో. మెత్తని చేతుల్తో నా గుండె మీద నిమురుతూ, ఎఱ్ఱటి పెదవులని నా నుదుటి మీద సుతిమెత్తగా అద్దుతూ, 'లేవండి స్వామీ!' అని లాలిత్యంగా లేపితే - ఆ హాయి కోసం, ఆ అనుభూతి కోసం తెలివొచ్చినా లేవకుండా నువ్వొచ్చిందాకా పడుకునే వాడ్ని కాదూ? అప్పుడే స్నానం చేసొచ్చి, స్నిగ్ధంగా ప్రత్యూష హిమస్నాత అయిన ఉషబాలలా నువ్వొస్తే చూడాలని కళ్లు మూసుకుని నిద్ర నటించే వాడ్ని కాదూ? మరిప్పుడేమయింది నీకు? ఎందుకు మానేశావవన్నీ! భర్తని వశం చేసుకునే వరకేనా ఆ ట్రిక్కులన్నీ?-అహ, అలా కోపంగా చూడకు. ఇందాకా నువ్వన్నావె అవసరాలకేనా భార్య అని. అందుకని అడుగుతున్నా. భర్త వశమయ్యాక ఇహ వాడిని నిర్లక్ష్యంగా వదిలేయటం

మేనా?-అటువంటప్పుడు ఈ లేపడాలూ అనురాగాలూ, వయ్యారాలూ ఒలకబోసి వాడికన్నీ నేర్పటమెందుకూ? తీరా ఆ మొగుడిగాడిలో అన్ని కోరికలూ, వేడుకలూ కలుగజేసి వాడిని పట్టించుకోకుండా వదిలేయటమెందుకు?-నిన్ననే మా ఫ్రెండొకడు చెప్పుకుని బాధపడ్డాడు. "పెళ్లయిన కొత్తలో మా అవిడ రోజూ పొద్దున్నే పక్కమీంచి లేచేటప్పుడు నన్ను గాఢంగా ముద్దుపెట్టుకుని మరీ లేచేది. ఇప్పుడిహ ఆ మాటే గుర్తులేదు దానికి. అది లేస్తున్న అలికిడికి తెలివొచ్చి నేనూ లేస్తాను. దానివేపే చూస్తాను, గుర్తొస్తుందేమోనని. ఊహూ. ఏం పట్టనట్టే వెళ్లి పోతుంది, తలుపులు చేరేసి. అక్కడికీ ఓ రోజు పట్టలేక అడిగాను. "నువ్వు నాకు అన్యాయం చేయటం లేదా"ని. నేనేం చేశాను అని ఆశ్చర్యపోయింది కానీ ఆ ఆలోచనే రాలేదు. మళ్లీ రెండ్రోజులాగి నేనే గుర్తు చేశాను. 'సారీ అండీ అంది! ఓ రెండ్రోజులు పాత అలవాటు కంటిన్యూ చేసింది. తర్వాత యథాప్రకారమే. ఈ ఆడాళ్లింత నిర్లక్ష్యం చేస్తారు మన్ని. వాళ్లని మనం పట్టించుకోమనీ నిర్లక్ష్యం చేస్తున్నామనీ చెప్పుకు చెప్పుకు వాపోతారు. రాత్రి ఎంత సుఖమనుభవించినా. ఎన్ని సరసాలాడుకున్నా, తెలతెలవారే వేళ శ్రీమతిచ్చే తొలి ముద్దులోనే ఎంతో తృప్తీ, సుఖమూ కలుగుతుంది నాకు. నాకే తను కావాలని కాదు. నా భార్యకి కూడా నేను కావాలనుకుంటే మనసు పులకరించదా?-ఆ మాత్రం అర్థమవదెందుకు మా అవిడకు? మగాడికీ సున్నితమైన భావాలూ, కోర్కెలూ వుంటాయని అనుకోరు. అదే స్త్రీల సమస్యలు, హక్కుల మీద లెక్చర్లిమ్మను. మగవాడన్యాయం చేసేస్తున్నాడని వలవల ఏడుస్తారు' అని వాపోయాడు. ఇప్పుడు చెప్పు, అలా అంత అందమైన మేలు కొలువులు పాడటం అలవాటు చేసిన నువ్విప్పుడేం చేస్తున్నావు? తెల్లారింది, లేవాలి, ఆఫీస్‌కి పోవాలి, పని చేయాలి-ఇందుకోసమేగా లేవటం. మరే ఆకర్షణా వద్దా లేవాలంటే. ఒక రాత్రి గడిచి, మరొకరోజు వచ్చింది. ఇదీ నిన్నటి లాగే గడపాలి కనుక లేద్దాం అనుకొని లేవాలా? ఈ రోజు నాకోసం ఏం తెస్తుంది? ఈ రోజు నా ప్రేయసి ఎలా నన్ను మేలు కొలుపుతుంది? నిద్ర నుంచి లేచిన నాకెలా స్వాగతం చెప్తుంది?

## శ్రీవారి ముచ్చట్లు

నేను లేవకపోతే ఎలా గారాలు పోతుంది? నిద్రలేపుతున్న తన్ను దగ్గరగా లాక్కుని ముద్దాడితే ఎలా వయ్యారాలు ఒలికిస్తుంది?-ఇలాంటి వేడుకలూ, కోరికలూ. మురిపాలె మనిషి బతుకులో అందాన్నీ, ఆకర్షణలనీ తెస్తాయి. పొద్దునే లేవటానికో ఉత్సాహం, ఏదో చెయ్యాలి, సాధించాలన్న తపన నా కోసం ఆరాటపడుతూ నన్ను నన్నుగా కోరుకునే వ్యక్తి వుందనే నమ్మకం, ఆ వ్యక్తి కోసం ఆకాశాన్నుంచి నక్షత్రాలైనా కొనుకొచ్చెయాలనే ఉబలాటం-ఇవన్నీ భార్య భర్తలో, భర్త భార్యలో కలిగించుకోవాలి. దాని కోసం ఉభయులూ కొత్త మార్గాలన్వేషించుకుంటూ వుంటే రొటీనూ, దూరం లాంటి పదాలకు తావే వుండదు. ఇప్పుడు చెప్పు, నువ్వొచ్చి నన్ను లేపవు అన్న నిరుత్సాహం రోజూ భరించే కన్నా, మొద్దు నిద్రపోయి, ఆ కోరికనే మరిచిపోవటం మంచిది కదూ? ఇంకా నేను మంచివాడిని కనుక నిద్రమత్తుతో సరిబెట్టాను. అదే మరొకళ్లయితే తాగి-

"ఛ. ఇంకాపండి బాబూ. మీరూ మీ మాటలూను. మొత్తానికి జయించేశారు, సార్. నా తప్పు ఒప్పుకున్నాను. రేపట్నుంచి నేనే మిమ్మల్ని లేపుతాను. సరేనా? నేను వచ్చి నిద్రలేపినంత మాత్రాన, నాకోసం ఆకాశంనించి నక్షత్రాలు తేగలిగేటంత శక్తి మీలో నింపగలిగితే అంతంటె గొప్పతనం ఇంకేముంది? మొత్తానికి తప్పు నా మీదే వేశారు. నా పిచ్చి కానీ, మాటల్లో మిమ్మల్నెప్పుడు గెలవగలిగాను కనుక?"

"అదుగో. మళ్లీ అలాగే అనకు. ఉదాహరణ సహితంగా చెప్పాను. ఒక విషయం ఎప్పుడూ మరిచిపోకు. ఒకరినొకరు దగ్గరగా బంధించుకుని వుంచుకోవాలన్నా, ఇద్దరి మధ్యా సాన్నిహిత్యమూ ఒకరిలో ఒకరు తాదాత్మ్యమూ తీవ్రం చేసుకోవాలన్నా-భార్య భర్తలిద్దరిదీ సమబాధ్యతే. నిజమే. కాని, ఇందులో భార్యవంతు పని కాస్త ఎక్కువ. తన పట్ల, జీవితం పట్ల భర్త ఆకర్షణని, అనురాగాన్ని రోజు రోజుకీ తీవ్రతరం చేయటం స్త్రీ చేతిలో వున్నంతగా పురుషుని చేతిలో లేదు. అక్కడే స్త్రీకి అగ్రస్థానం, ఉన్నత స్థానం ఇచ్చింది ప్రకృతి. స్త్రీలో వున్నంత వైవిధ్యమూ, నిత్యనూతనత్వమూ పురుషునిలో లేనే లేదు. మరి అది మీ ఆడవాళ్లు గుర్తించి నిలబెట్టుకోవాలి"

'అయ్యా. చిత్తం' బుద్ధిగా తలూపి లేవబోతుంటే, నా చెయ్యి పట్టుకుని అల్టిమేటమ్ యిచ్చారు. "ఇదుగో. లేపమన్నాను గదాని, ఇవాళ లేపినట్టే రేపు లేపితే లేవను సుమా! రేపు మరో కొత్త పద్ధతిలో లేపాలి."

చచ్చాం పో! నేరకపోయి లేపానివాళ. రోజూ ఏం వండాలో, ఎలా వండాలో ఆలోచించుకున్నట్టు, రోజూ ఈయన్నెలా లేపడమో కూడా!

○

